
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 8 । జూన్ । 2025



సోమశిలలో 40.712 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 40.712 టీఎంసీలు ఉన్నాయి. 270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డెల్టాకు 3,280, ఉత్తర, దక్షిణ కాలువలకు 650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,120
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,980
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,249
నవర (8 గ్రాములు)	రూ.73,992

గరిష్టం/కనిష్టం
40.8 /30.0

వాతావరణం

అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 36 శాతంగా నమోదైంది.

చెప్పేదొకటి.. చేసేదొకటి

జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. పారదర్శకతకు పాతరేస్తూ ఆన్‌లైన్‌లో పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించడం, ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించడం ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురి చేస్తోంది. బదిలీ ఉత్తర్వులు ఇచ్చాక.. ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఇవ్వడం చూస్తే ఉపాధ్యాయుల హక్కులను హరించడమే అవుతోంది. సీనియారిటీ ప్రకారం ప్రాధాన్యత పాఠశాలలను ఎంపిక చేసుకునే అవకాశాన్ని కోల్పోయామంటూ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అసంబద్ధ బదిలీలను అడ్డుకునేందుకు మెరుపు ఉద్యమానికి ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఆదివారం అయినప్పటికీ డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించి వెబ్ ఆప్షన్లను బాయికాట్ చేయాలని నిర్ణయించారు.

ఆన్‌లైన్‌లో పదోన్నతుల కౌన్సెలింగ్ షెడ్యూల్

- ఆఫ్‌లైన్‌లో తెల్లవారుజాము వరకు నిర్వహణ
- సీనియారిటీ జాబితాలో పలుసార్లు మార్పులు
- ఇప్పటికే 1500 మందికి పైగా ఎస్‌ఏలకు బదిలీ ఆర్డర్లు
- తాజాగా వారికి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

నెల్లూరు (టౌన్): బదిలీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయుల హక్కులు, ఆత్మగౌరవంతో ఆటలాడుతున్నాయి. ఈ ప్రక్రియపై చెప్పేదొకటి చేసేదొకటిగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఆన్‌లైన్‌లో పదోన్నతుల కౌన్సెలింగ్ ఉంటుందని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి తమ ప్రాధాన్యతలను హరించిందని ఆగ్రహంతో ఉన్నారు. సీనియారిటీ జాబితా కూర్పులో సరైన అవగాహన లేకపోవడంతో జాబితాను అనేక సార్లు మార్పులు చేయడంతో కొంత మంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని విచారం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతుల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో డీఈఓను నిలదీస్తున్న ఉపాధ్యాయులు

గందరగోళంగా ఉపాధ్యాయుల బదిలీలు

రెండు రోజుల క్రితం కొంత మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రాథమిక పాఠశాలల హెడ్‌మాస్టర్లుగా పదోన్నతులు కల్పించారు. శుక్రవారం రాత్రి అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇచ్చారు. అయితే ఈ కౌన్సెలింగ్ శనివారం తెల్లవారుజాము వరకు జరిగింది. ఎస్జీటీలకు పూర్తిగా ఆఫ్‌లైన్‌లోనే కౌన్సెలింగ్ ఉంటుందని ప్రకటించిన ప్రభుత్వం తాజాగా ఆన్‌లైన్‌లో వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెబ్ ఆప్షన్లు బాయ్‌కాట్, డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఎస్జీటీల కౌన్సెలింగ్ జరుగుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది.

రెండు.. మూడు రోజులు అవకాశం ఇస్తాం

ఎస్జీటీల బదిలీలకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ అధికారులు వెబ్ ఆప్షన్లను విడుదల చేశారు. ఎస్జీటీలు ఆప్షన్లు పెట్టుకునేందుకు రెండు.. మూడు రోజులు అవకాశం కల్పిస్తాం. ఎస్జీటీలకు ఆఫ్‌లైన్‌లో బదిలీలు నిర్వహించాలంటే వారం రోజులకు పైగా పడుతుంది. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలల పునః ప్రారంభం నాటికి బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. సమయం లేనందున ఎస్జీటీల బదిలీలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. – **ఆర్ బాలాజీరావు, డీఈఓ**

101 మంది ఎస్‌ఏలకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సీనియారిటీ, పాయింట్లు ఆధారంగా 101 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రాథమిక పాఠశాలల హెడ్ మాస్టర్లుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో 89 మంది జెడ్పీ, నలుగురు మండల పరిషత్, 8 మంది మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు. జిల్లాలో మొత్తం 2,844 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8 ఏళ్లు పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు 1,289 మంది ఉండగా, రెండేళ్లు పూర్తి చేసుకున్న, రిక్వెస్ట్ బదిలీ కోసం 1,555 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే 8 ఏళ్లు పూర్తి చేసుకున్న 1,289 మంది స్కూల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా బదిలీ అయ్యారు. వీరికి బదిలీ ఆర్డర్లను కూడా జారీ చేశారు. అయితే రిక్వెస్ట్, రెండేళ్లు పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లలో కొంత మంది బదిలీ అయ్యారని తెలిసింది. ఎంత మంది ఉన్నారనే సమాచారం లేదు. స్కూల్ అసిస్టెంట్లు బదిలీల విషయంలో క్లస్టర్ వేకేన్సీలు చూపించకపోవడంతో సీనియారిటీ, పాయింట్లు ఉన్న ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు పోస్టింగ్‌లు పడ్డాయని, ఈ విషయంలో వారు నష్టపోయారని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ చాంబర్ ముందు ధర్నా నిర్వహించారు.

120 మందికి పైగా ఎస్జీటీలకు పదోన్నతులు

జిల్లాలో 120 మందికి పైగా సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో 95 మందికి పైగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, మిగిలిన వారు గూడూరు, కావలి మున్సిపాల్టీల పరిధిలోని పాఠశాల ఎస్జీటీలు ఉన్నట్లు తెలిసింది. అయితే ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సిన ఎస్జీటీల పదోన్నతుల కౌన్సెలింగ్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించారు. ఇదేమిటని అడిగితే సాఫ్ట్‌వేర్ పనిచేయడం లేదని, ఎర్రర్‌లు వస్తున్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్‌ను కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అడ్డుకుని డీఈఓ బాలాజీ రావును నిలదీసినా పరిస్థితిలో మార్పు లేదు.

ఆన్‌లైన్‌లోనే ఎస్జీటీల బదిలీల ప్రక్రియ

సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చింది. అయితే ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాత్రం బదిలీల ప్రక్రియను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎస్జీటీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల డిమాండ్‌కు తలొగ్గుతుందా లేక ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

నేడు డీఈఓ కార్యాలయ ముట్టడి

నెల్లూరు (టౌన్): సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఆఫ్‌లైన్‌లో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చింది. శనివారం వెబ్ కౌన్సెలింగ్‌పై ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తొలుత జరిగిన హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లు వెబ్ కౌన్సెలింగ్‌లో ఘోరంగా విఫలమైందన్నారు. పదోన్నతుల వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు పెట్టలేక మాన్యువల్‌గా నిర్వహించారన్నారు. ఉపాధ్యాయులు ఎన్నడూ లేని విధంగా మానసిక క్షోభ అనుభవించారన్నారు. స్కూల్ అసిస్టెంట్ల వెబ్ ఆప్షన్లలో కనిపించినా క్లస్టర్ వేకెన్సీలను ఎక్కువ పాయింట్లు వచ్చిన వారికి కాకుండా తక్కువ పాయింట్లు వచ్చిన వారికి కేటాయించారన్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ వాళ్లు జనరల్ కేటగిరీ కింద ప్లేస్‌లు కేటాయించకపోవడం, బాలికోన్నత పాఠశాలల్లో పురుషులను కేటాయించడం వంటి వింతలు జరిగాయన్నారు. ఈ రీతిలో విఫలమైన వెబ్ కౌన్సెలింగ్ ఎస్జీటీల మీద బలవంతంగా రుద్దుతున్నారని మండిపడ్డారు. వెబ్ ఆప్షన్లను అందరూ బాయ్‌కాట్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు సురేంద్రరెడ్డి, అనిల్‌కుమార్, చలపతిశర్మ, నరసింహులు, హజరత్, కృష్ణారెడ్డి, మధుసూదనరావు, శివశంకరరెడ్డి, పద్మజ, మస్తాన్, ఖాజారహంతుల్లా, మునీంద్ర, రాజగోపాలాచారి, శేషులు, అశోక్‌బాబు, అజయ్‌బాబు, డేవిడ్, చినబాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తృతీయ స్థానం

నెల్లూరు (టౌన్): శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో నెల్లూరు జిల్లా రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సర పరీక్షలకు 6,342 మంది విద్యార్థులు హాజరు కాగా 3,395 మంది ఉత్తీర్ణత సాధించడంతో 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 3,469 మంది విద్యార్థులు హాజరైతే 2,677 మంది పాసయ్యారు. 77 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రథమ సంవత్సర ఒకేషనల్‌లో 283 మందికి 200 మంది పాస్ కాగా, 77 శాతం ఉత్తీర్ణత, ద్వితీయ సంవత్సరంలో 141 మందికి 128 మంది పాస్ కావడంతో 91 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

రేపు షైనింగ్ స్టార్స్ అవార్డులు

నెల్లూరు (టౌన్): జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 273 మంది విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులను అందజేయనున్నారు. స్థానిక కస్తూరిదేవి గార్డెన్‌లో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పదో తరగతిలో 237 మంది, ఇంటర్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు, ప్రతిభా పురస్కారం, తల్లిదండ్రులకు సన్మానం చేయనున్నారు.

రెండో రోజూ కొనసాగిన విచారణ

నెల్లూరు (క్రైమ్): మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసు అధికారులు రెండో రోజూ విచారించారు. రుస్తుం మైన్‌లో అక్రమ మైనింగ్ చేయించారంటూ నమోదు చేసిన అక్రమ కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న కాకాణిని కోర్టు అనుమతితో పోలీసు అధికారులు శుక్రవారం మూడు రోజుల పోలీసు కస్టడీకి తీసుకుని కృష్ణపట్నం పోర్టు స్టేషన్‌లో న్యాయవాది సుబ్బారెడ్డి సమక్షంలో కాకాణిని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు విచారిస్తున్నారు. శనివారం 57 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఆదివారంతో పోలీసు కస్టడీ ముగియనుంది.

రైస్‌మిల్లులో భారీగా రేషన్ బియ్యం పట్టివేత



రీసైక్లింగ్ చేసిన రేషన్ బియ్యాన్ని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతున్న దృశ్యం

- సుమారు 12.5 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు అంచనా

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి రైస్‌మిల్లులో పాలిష్ పట్టి.. మేలు రకం బియ్యంగా మార్చిన సుమారు 12.5 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం (500 బస్తాలు)ను శనివారం రాత్రి అధికారులు పట్టుకొన్నారు. ఇదే రైస్‌మిల్లులో గత నెల 3వ తేదీన 200 బస్తాల రేషన్ బియ్యం పట్టుకోవడం తెలిసిందే. చంద్రశేఖరపురంలోని రైస్ మిల్లులో రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతోందని శనివారం రాత్రి రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో డీటీ సారంగపాణి, వీఆర్వో సురేష్, ఎస్సై కోటిరెడ్డి మిల్లుకు చేరుకున్నారు. నిర్వాహకులు రైస్‌మిల్లుకు తాళాలు వేసి కొంత సేపు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఎస్సై జోక్యం చేసుకోవడంతో ఎట్టకేలకు తలుపులు తెరవడంతో అధికారులు లోనికి వెళ్లారు. భారీ ఎత్తున రీసైక్లింగ్ చేసిన రేషన్ బియ్యంను, పదుల సంఖ్యలో కూలీలతో ప్లాస్టిక్ సంచుల్లో నింపి లారీకి లోడు చేస్తుండడాన్ని గుర్తించారు. రైస్ మిల్లును లీజుకు తీసుకుని రేషన్ బియ్యంతో వ్యాపారం చేస్తున్న వ్యక్తి రేషన్ బియ్యం గోతాలు మిల్లులో లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. దాదాపు అన్నింటినీ ప్లాస్టిక్ బస్తాల్లో నింపారు. 25 కేజీల బస్తాలు సుమారు 500 బస్తాలు 12.5 మెట్రిక్ టన్నులు ఉంటాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ మిల్లులో గింజ ధాన్యం కొని ఆడించిన దాఖలాల్లేవని, ఇక్కడ కేవలం రేషన్ బియ్యం రీసైక్లింగ్ మాత్రమే జరుగుతోందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. రీసైక్లింగ్ చేసి మేలి రకం బియ్యం కింద విక్రయించే వ్యాపారం చేస్తున్న క్రమంలో అన్నీ 25 కిలోల ప్లాస్టిక్ బస్తాల్లో నింపుతున్నారు. మరో వంద బస్తాల దాకా నింపాల్సిన బియ్యం ఉన్నాయని తెలిపారు. తగినంత సిబ్బంది అందుబాటులో లేనందున ఆదివారం బస్తాలన్నింటినీ లెక్కించి కచ్చితంగా నిర్ధారిస్తామన్నారు. పేదల బియ్యంతో భారీగా కాసులు కురిపించుకొంటున్న వ్యాపారులు ఎన్ని పర్యాయాలు పట్టుకొన్నప్పటికీ అక్రమ వ్యాపారాన్ని ఆపడం లేదంటే ఇందుకు జిల్లా స్థాయిలో అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెలలోనే రేషన్ బియ్యం పట్టుబడితే మిల్లును సీజ్ చేయకపోవడంతోనే తిరిగి ఆ వ్యాపారం చేయడానికి అవకాశం ఏర్పడినట్లు తెలుస్తోంది.

అక్రమ దందాకు ‘పచ్చ’జెండా

- అడ్డుగా ఉన్న ఎండీయూ వాహనాలను రద్దు చేశారు
- దుకాణాలు మూసేసి విచ్చలవిడిగా ఎత్తేస్తున్నారు
- అర్ధరాత్రి వేళ రేషన్ బియ్యం అక్రమరవాణా
- జిల్లాలో బరితెగించిన తమ్ముళ్లు
- రేషన్ మాఫియా నెల రాబడి రూ.27 కోట్లు!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్న విషయం ఎక్కడికక్కడ బట్టబయలయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ బియ్యం రైస్‌మిల్లులకు తరలిపోతున్న ఉదంతాలు వెలుగు చూశాయి. ఇలాంటి అక్రమ దందాకు రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలు అడ్డుగా ఉన్నాయని భావించి తప్పుడు ప్రచారమే ప్రచారాస్త్రంగా ఎంచుకుని కూటమి నేతల నుంచి పచ్చమీడియా వరకు విషం చిమ్మారు. ఈ వాహనాల ద్వారానే రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని దుష్ప్రచారం చేశారు. వీటి వల్ల ప్రభుత్వానికి భారమని మొసలి కన్నీరు కార్చారు. చివరకు రద్దు చేసి డీలర్లకే అప్పగించారు. దీంతో అక్రమ దందాకు ‘పచ్చ’జెండా ఊపేసినట్లు అయింది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జూన్ 1వ తేదీ.. జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద పండగ వాతావరణం ప్రతిబింబించేలా షామియానాలు, కుర్చీలు, ఫ్లెక్సీలు, పూల తోరణాలతో డెకరేషన్ చేశారు. రేషన్ పంపిణీ ప్రక్రియ తమ చేతికే వచ్చిందని డీలర్లు పండగ చేయడం చూస్తే.. ఇక తమ అక్రమ దందాకు అడ్డు తొలగిపోయిందనే సంతోషం వెల్లివెరిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యేలే రేషన్ మాఫియాగా అవతరించారనేది జగద్విదితమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రతి రేషన్ దుకాణానికి నూరు శాతం రేషన్ బియ్యం నెలాఖరు రోజుకే చేరేవి. ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 8 గంటలకే ఎంఈయూ వాహనాలు కార్డుదారుల ఇళ్ల ముందుకే వచ్చేవి. ప్రతి కార్డుదారుడు బియ్యం తీసుకెళ్లేవారు. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరిగినట్లు, కేసులు నమోదు చేసినట్లు ఎక్కడా లేకపోవడం గమనార్హం. కూటమి అధికారంలోకి వచ్చాక 5వ తేదీ వరకు ఎండీయూ వాహనాలు వచ్చిన పరిస్థితి లేదు. వచ్చినా.. అరకొర మందికి ఇచ్చి మళ్లీ వస్తామంటూ చెప్పుకొచ్చారు. ఒకటి..రెండు నెలలు అయితే వాహనాలే రాని పరిస్థితి ఉంది.

ప్రతి నెలా అరకొర మందికే..

కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అరకొర మందికే రేషన్ సరుకులు సరఫరా అయ్యాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు చేరుతున్నట్లు రికార్డుల్లో ఉన్నప్పటికీ.. వాస్తవానికి ఆ బియ్యం అంతా నేరుగా రైస్ మిల్లులకు వెళ్లాయని కొందరు సివిల్ సప్లయీస్ శాఖాధికారులు అంగీకరించారు. గత రెండు నెలల క్రితం దగదర్తి మండల కేంద్రంలో, కోవూరు సమీపంలో చెన్నై–కోల్‌కత్తా హైవేలో రెండు లారీల్లో వెళ్తున్న సుమారు 900 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడినా.. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఆగమేఘాల మీద వదిలేసిన విషయాలు తెలిసిందే. నిజంగా కార్డుదారులకు బియ్యం చేరి ఉంటే.. ఈ స్థాయిలో బియ్యం అక్రమ రవాణాకు ఎక్కడ ఆస్కారం ఉంటుందనే ప్రశ్నలకు అధికారులు కానీ, కూటమి నేతలు కానీ, పచ్చ మీడియా సమాధానం చెప్పరు. తాజాగా నెల్లూరు రూరల్ పరిధిలో బియ్యం మాఫియా బరితెగించి దుకాణాల్లో ఉన్న బియ్యాన్ని రాత్రికి రాత్రే తరలించేశారు. జూన్ 1వ తేదీ రేషన్ దుకాణాల దగ్గరే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటన చేసినా ఇరుకుల పరమేశ్వర్‌నగర్‌లో ముందు రోజు రాత్రే దుకాణం తెరిపించి, అర్ధరాత్రి వేళ బియ్యాన్ని అక్రమ రవాణా చేశారు. ఇది స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అయినా సంబంధిత దుకాణంలో బియ్యం స్టాక్ తనిఖీ చేయడం కానీ, విచారణ జరపడం కానీ చేయలేదు.



నెల్లూరు రాయాజీవీధిలో రేషన్ దుకాణం ముందు ఆర్భాటంగా ఏర్పాట్లు

మొత్తం రేషన్ షాపులు	1,513
బియ్యం కార్డులు	7.22 లక్షలు
నెలకు సరఫరా అయ్యే బియ్యం	10,923 మెట్రిక్ టన్నులు
కార్డుదారులకు చేరేది	15-20 శాతమే
అక్రమ రవాణా అంచనా	9,000 మెట్రిక్ టన్నులు

80 శాతంపైనే విదేశాలకు ఎగుమతి

జిల్లాలో ఉన్న 7.22 లక్షల రేషన్ కార్డులకు నెలకు సుమారు 10,923 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఇందులో 15 నుంచి 20 శాతం మాత్రమే కార్డుదారులు కొని తీసుకెళ్తున్నారు. మిగిలిన 80–85 శాతం బియ్యం కావలి, నెల్లూరులోని సౌత్‌రాజుపాళెం, శెట్టిగుంటరోడ్, బుచ్చిరెడ్డిపాళెం–రాజుపాళెం రహదారిలో ఉన్న రైస్ మిల్లు, పోతిరెడ్డిపాళెం, అల్లీపురం, నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు, చెముడుగుంట, కందుకూరు నియోజకవర్గంలోని పెదపవనిలో ఉన్న రైస్‌మిల్లులకు చేర్చి పాలిష్ పట్టించి కృష్ణపట్నం, చెన్నై పోర్టుల నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

నెలకు రూ.27 కోట్ల రాబడి

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు డీలర్లే సూత్రధారులు. కార్డుదారులకు ఇచ్చిన బియ్యాన్ని కేజీకి రూ.10లకు కొనుగోలు చేస్తున్నారు. ఇక ఒక్కొక్క రేషన్ డీలర్ వద్ద 250 నుంచి 300 బినామీ కార్డులు ఉన్నాయి. ఈ కార్డులకు బియ్యం సరఫరా చేసినట్లు నమోదు చేస్తున్నారు. ఇలా ఒక్కొక్క రేషన్ దుకాణం నుంచి 80 – 85 శాతం అంటే దాదాపు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు చేరుతోంది. అంటే ప్రతి నెలా సగటున 90 లక్షల కేజీలు అక్రమ రవాణా జరుగుతుందని అంచనా. తాజాగా బియ్యం మాఫియా ఆయా రేషన్ దుకాణాలకు చేరాల్సిన బియ్యాన్ని నేరుగా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. డీలర్‌కు కేజీకి రూ.20 లెక్కన ఇస్తున్నారు. మార్కెట్లో కేజీ బియ్యం రూ.60 నుంచి రూ.65లకు అమ్ముతున్నారు. ఈ లెక్కన రవాణా ఖర్చులు, పాలిష్ తరుగు, సివిల్ సప్లయీస్ అధికారులకు మామూళ్లకు కేజీకి రూ.10 ఖర్చు పోయినా.. కేజీకి నికరంగా రూ.30 మిగులుతోంది. 90 లక్షల కేజీలకు.. కేజీకి రూ.30 లెక్కన దాదాపు రూ.27 కోట్ల మేర మాఫియాకు రాబడి వస్తోంది.

ముందే రేషన్ దోపిడీ?

ఉలవపాడు: రేషన్ షాపుల వ్యవస్థ ప్రారంభమైన వెంటనే అక్రమార్కుల హవా మొదలైంది. మండలంలో ప్రతి రేషన్ షాపునకు 50 బస్తాలు తక్కువగా రేషన్ బియ్యం సరఫరా చేసినట్లు సమాచారం. మండలంలో 31 రేషన్ షాపులు ఉండగా మూడు షాపులు తప్ప మిగిలిన అన్ని షాపులకు 50 బస్తాలు కోత విధించడంతో.. మొదటి నెలలోనే ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని రేషన్ డీలర్లు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.ఈ విషయమై తహసీల్దార్ టి.శ్రీనివాసులు వివరణ కోరగా బస్తాలు తగ్గించిన విషయం నాకు తెలియదు, డీలర్లు అధికారులతో మాట్లాడి విచారణ జరిపి తెలుసుకుంటామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్





త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ముస్లింలు శనివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని ఈద్గాలు, మసీదుల్లో సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు. బారాషహీద్‌దర్గాలో సయ్యద్ అబూబకర్ అష్రఫి సాబిరి, సంతపేట, నవాబుపేట నజీర్‌తోట తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద మతపెద్దలు బక్రీద్ విశిష్టతను తెలియజేస్తూ సందేశాన్నిచ్చారు. - సాక్షి ఫొటో గ్రాఫర్, నెల్లూరు

వ్యక్తిగత పూచీకత్తుపై నిరంజన్‌రెడ్డి విడుదల

నెల్లూరు (లీగల్): గ్రావెల్ అక్రమ తవ్వకాల కేసులో అభియోగం ఎదుర్కొంటున్న నిరంజన్‌రెడ్డి రిమాండ్ రిపోర్టును న్యాయమూర్తి తిరస్కరించారు. ఆయన్ను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. 2021లో అప్పటి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకం ఫోర్జరీ చేసి సర్వేపల్లి జలాశయం నుంచి గ్రావెల్ తరలించారనే ఆరోపణలపై వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో ఉదయ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తాజాగా ఆ కేసులో వీరి పేర్లు తొలగించి, ఆ స్థానంలో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితోపాటు ఆయన ముఖ్య అనుచరుడైన నిరంజన్‌రెడ్డి పేర్లను నమోదు చేసిన సిట్ అధికారులు శుక్రవారం బెంగళూరులో ఉన్న నిరంజన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని ఏపీకి తరలించి అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం మాగుంటలేఅవుట్‌లోని సెకండ్ ఏజేఎఫ్‌ఎంసీ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పాలమంగళం వినోద్ ఇంటి వద్ద హాజరుపరిచారు. సిట్ తరఫున స్పెషల్ పీపీ, నిరంజన్‌రెడ్డి తరఫున న్యాయవాదులు రోజారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి తమ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి రిమాండ్ రిపోర్టును తిరస్కరిస్తూ వ్యక్తిగత పూచీకత్తుపై నిరంజన్‌రెడ్డిని విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



న్యాయమూర్తి నివాసంలో హాజరుపరిచేందుకు నిరంజన్‌రెడ్డిని తీసుకెళ్తున్న సిట్ అధికారులు

సంక్షోభంలో నిమ్మ మార్కెట్

దిగుబడి పెరిగినా పతనమైన ధరలు

- ఆందోళనలో వ్యాపారులు
- రైతుల నుంచి విపరీతంగా వస్తున్న కాయలు
- మార్కెటింగ్ శాఖ చొరవ చూపాలని వినతి

దిగుబడి పెరిగినా పతనమైన ధరలు.. బయటి రాష్ట్రాల నుంచి ఎగుమతులు జోరందుకోవడంతో స్థానిక నిమ్మ మార్కెట్ సంక్షోభంలో చిక్కుకుంది. ఆరేళ్ల నాటి పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆ సమయంలో మార్కెట్‌కు వచ్చిన కాయలను దూరంగా చెత్తకుప్పల్లో వ్యాపారులు పడేశారు. మున్ముందు ఎలా ఉండబోతోందననే సందేహాలు తలెత్తుతున్నాయి.



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

పొదలకూరు: నిమ్మ ధరలు వారం రోజులుగా పూర్తిగా తగ్గిపోయి పతనావస్థలో ఉన్నాయి. ప్రస్తుతం కిలో రూ.20 నుంచి రూ.30 వరకే పలుకుతోంది. సీజన్లో నిత్యం 20 లారీల్లో కాయలు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతై మార్కెట్ కళకళలాడుతుండేది. జిల్లాలో సుమారు 17 వేల హెక్టార్లలో నిమ్మను సాగు చేస్తున్నారు.

ఉన్నట్లుండి కుదేలై

పొదలకూరు ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డు నుంచి నాణ్యమైన కాయలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతవుతాయి. గూడూరు ప్రైవేట్ మార్కెట్ నుంచీ ఎగుమతులు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. అయితే ఉన్నట్లుండి మార్కెట్ పడిపోవడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఎగుమతుల్లేకపోయినా, రైతుల నుంచి వచ్చే కాయలను తాము తీసుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

బయటి రాష్ట్రాల తాకిడి

సాధారణంగా ఏపీ, తెలంగాణ నుంచి నిమ్మ ఎగుమతులు అధికంగా ఉంటాయి. రాష్ట్రంలో పొదలకూరు, గూడూరు, ఏలూరు, తెనాలి తదితర పెద్ద మార్కెట్లతో పాటు చిన్న మార్కెట్లూ పదుల సంఖ్యలో ఉన్నాయి. తెలంగాణలో నకిరేకల్లు మార్కెట్ నిమ్మకు పెట్టింది పేరు. అయితే ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, బిహార్ తదితర రాష్ట్రాల్లో సాగు ఉండటంతో కాయల దిగుబడి పెరిగి ఎగుమతవుతున్నాయి. దీనికి తోడు ఇక్కడి తోటల్లో కాయలు విపరీతంగా పెరగడంతో, మార్కెట్లకు ఒక్కసారిగా వచ్చి పడుతున్నాయి. దీంతో ఢిల్లీ, మధుర, వారణాశి, గోరఖ్‌పూర్, చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం తదితర మార్కెట్లకు నిమ్మకాయలను తీసుకురావద్దని సమాచారం అందజేస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లిన వాటినీ తిరస్కరిస్తున్నారని సమాచారం. ఫలితంగా ధరలు పతనమవుతున్నా, రైతుల నుంచి వచ్చే కాయలను వద్దనలేని వ్యాపారులు కొనుగోలు చేసి యార్డులో రాసులుగా పోసుకుంటున్నారు.

మార్కెటింగ్ శాఖ చొరవే శరణ్యం

ఎన్నడూ లేని విధంగా నిమ్మ మార్కెట్ సంక్షోభంలో పడింది. దీంతో మార్కెటింగ్ శాఖ చొరవ చూపి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి రైతులు, వ్యాపారులకు గిట్టుబాటు ధర కల్పించాల్సి ఉంది. యార్డుకు వస్తున్న కాయలను బయటి ప్రాంతాలకు ఎగుమతి చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు యార్డుకు వచ్చిన కాయలను ఏమి చేయాలో పాలుపోక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు.



ప్యాకింగ్ పూర్తయి.. ఎగుమతుల కోసం ఎదురుచూపులు



బోసిపోయిన మార్కెట్

దిగజారిన ధరలు



నిమ్మధరలు దిగజారాయి. కాయల ధరలు పడిపోవడంతో కూలీల ఖర్చులూ గిట్టుబాటు కావడం లేదు. ఇలాగే ఉంటే టమోటా రైతుల పరిస్థితి నిమ్మ రైతులకు ఏర్పడుతుందనే ఆందోళన నెలకొంది. కాయలను వ్యాపారులు వద్దనకుండా తీసుకుంటున్నా.. వారు ఎగుమతి చేయలేని పరిస్థితి.

– పెంచలనారాయణరెడ్డి, రైతు, అంకుపల్లి

తోటల్లో విపరీతంగా కాయలు



నిమ్మతోటల్లో కాయలు విపరీతంగా ఉన్నాయి. కోసిన వాటిని మార్కెట్‌కు పంపుతున్నాం. వీటిని ఏమి చేసుకోవాలో అర్థం కాని పరిస్థితుల్లో వ్యాపారులున్నారు. ఎగుమతులు తగ్గిపోయాయని చెప్తున్నారు. కాయలు కోసినా కూలీ రేటు గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు.

– రమేష్, రైతు, నావూరుపల్లి

రైతుల కోసం కొనుగోలు



వ్యాపారుల పరిస్థితి దారుణంగా ఉంది. మార్కెట్‌కు కాయలు రాసులుగా వస్తున్నాయి. ఇబ్బందుల సమయంలో వద్దని రైతులకు చెప్పలేకపోతున్నాం. ధరలు పెరిగే అవకాశం లేదు. సంక్షోభ దశగా ఉందనే విషయం అర్థమవుతోంది. ఎగుమతులు పెరిగితేనే తట్టుకొని నిలబడగలం.

– బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్ యార్డు, పొదలకూరు

క్లుప్తంగా

కోడలిపై అత్త ఫిర్యాదు

ఇందుకూరుపేట: వృద్ధురాలైన తనపై కోడలు దాడి చేస్తోందంటూ పోలీసులకు పాములవారిపాళేనికి చెందిన మస్తాన్‌బీ ఫిర్యాదు చేశారు. తన కుమారుడ్ని కోడలు వహీదా పట్టించుకోకపోవడంతో మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందారని చెప్పారు. తన ఆస్తిని కాజేయాలని యత్నించగా, కోర్టులో తనకు అనుకూలంగా తీర్పొచ్చిందని, దీంతో దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పారు. స్థానికంగా ఉన్న ఓ నాయకుడి అండతోనే ఈ విధంగా పాల్పడుతోందని, తనకు న్యాయం చేయాలని కోరారు.

అనారోగ్యంతో సచివాలయ ఉద్యోగి మృతి



హరిత (ఫైల్)

సంగం: స్థానిక సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులోని వైద్యశాలలో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. వివరాలు.. పెరమనకు చెందిన పులిబోయిన హరిత (28) బీటెక్ చదివి, గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సచివాలయ పరీక్షల్లో రాణించి ఇంజినీర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందారు. ఈ క్రమంలో కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురయ్యారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో నెల్లూరులోని వైద్యశాలకు తల్లిదండ్రులు, ఆమె భర్త తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలికి పాప, బాబు ఉన్నారు. ఎంపీడీఓ షాలెట్ తదితరులు సంతాపం తెలియజేశారు.

యువకుడిపై పోక్సో కేసు

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరుకు చెందిన ఈదూరు నితీష్‌కుమార్‌పై పోక్సో కేసును నమోదు చేశామని ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ఓ బాలికను అపహరించి, లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



సంగం: గేదెలను బైక్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన సంగం – కలిగిరి రహదారిలోని ఎర్ర చెరువు వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని చెన్నవరప్పాడుకు చెందిన ముత్యాల కోటయ్య, పేట శివరామయ్య పనిమిత్తం బైక్‌పై సంగం వచ్చారు. తిరిగి ఇంటికెళ్తుండగా, ఎర్ర చెరువు వద్ద రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెలను బైక్ ఢీకొంది. దీంతో రోడ్డుపై పడి ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో నెల్లూరు తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



నాయుడుపేట టౌన్: రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడటంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాయుడుపేట రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మాలకొండయ్య వివరాల మేరకు.. తమిళనాడులోని ఈరోడ్ నుంచి జబల్‌పూర్‌కు వెళ్లే రైలు నుంచి వ్యక్తి జారిపడి మృతి చెందారు. స్టేషన్ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. మృతుడి చేతిపై ఇంగ్లిష్‌లో జ్యోతి పేరుతో పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్): 132
లేయర్ (లైవ్): 115
బ్రాయిలర్ చికెన్: 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్: 262
లేయర్ చికెన్: 195

పొదలకూరు నిమ్మ ధరలు(కిలో)



పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10

పలువురు ఇంజినీరింగ్ అధికారుల బదిలీ

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ, ప్రజారోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఇంజినీరింగ్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. నెల్లూరు కార్పొరేషన్లో డీఈఈగా ఉన్న సాయిరామ్‌ను కావలి మున్సిపాల్టీకి, అక్కడ డీఈఈగా ఉన్న వేణుగోపాల్‌ను ఎస్‌ఎంసీకి బదిలీ చేశారు. ప్రజారోగ్య శాఖ నెల్లూరు సబ్ డివిజన్లో డీఈఈగా విధులు నిర్వర్తిస్తున్న సుధారాణిని పబ్లిక్ హెల్త్ కావలి సబ్ డివిజన్‌కు, అక్కడ డీఈఈగా ఉన్న జానకిరామ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. పబ్లిక్ హెల్త్ సర్కిల్ కార్యాలయంలో డీఈఈగా ఉన్న కోటేశ్వరరావును ఏపీటిడ్కో నాయుడుపేటకు, అక్కడున్న డీఈఈ పార్థసారథిని ఇక్కడి సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఎంపీడీఓ కార్యాలయానికి చేరిన కలప



అత్మకూరు రూరల్: రంగూన్ కలపను కొట్టేసేందుకు యత్నించిన స్కెచ్ బెడిసికొట్టింది. 'రంగూన్ కలపను కొల్లగొట్టే ప్లాన్' అనే శీర్షికన సాక్షిలో కథనం శనివారం ప్రచురితమైన నేపథ్యంలో అధికారుల్లో చలనమొచ్చింది. పట్టణంలోని పాత సమితి కార్యాలయం, ప్రస్తుత పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్న పురాతన భవనాన్ని గుట్టుచప్పుడు కాకుండా కూలగొట్టి అందులోని కలపను మండలంలోని చెర్లోయడవల్లికి చెందిన ఓ టీడీపీ నేత ఇంటికి తరలించిన అంశం బహిర్గతం కావడంతో ఆగమేఘాలపై అధికారులు స్పందించారు. తరలించిన టేకు కలపలో కొంత భాగాన్ని ఎంపీడీఓ కార్యాలయం వద్దకు తరలించారు. అయితే మిగిలిన వాటిని పూర్తిగా రాబట్టడంలేదనే విమర్శలున్నాయి.

సాక్షి ఎఫెక్ట్..

కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పాలన



మాట్లాడుతున్న నరసింగరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కార్మిక వ్యతిరేక పాలనను కూటమి ప్రభుత్వం సాగిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు ఆరోపించారు. నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం, కృష్ణపట్నం పోర్టులో కార్మికులను తొలగించడం మినహా ఎలాంటి పరిశ్రమలను స్థాపించిన దాఖలాల్లేవని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు దాసోహంగా ఉంటూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. సంక్షేమ బోర్డులోని రూ.వెయ్యి కోట్ల నిధులను దారి మళ్లించడం సిగ్గుచేటన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని అమలు చేస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని ఆరోపించారు. జూలై తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి



మాట్లాడుతున్న గురవయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య ఆదేశించారు. విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో నెల్లూరు రూరల్ డివిజన్ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వినియోగదారుల నుంచి సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తోందని తెలిపారు. లో ఓల్టేజీ ఉన్న ప్రాంతాలను గుర్తించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం బుజబుజనెల్లూరు సబ్‌స్టేషన్‌ను సందర్శించి.. సరఫరా, రికార్డులను పరిశీలించారు. ఎస్‌ఈ విజయన్, రూరల్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్ల ఢీ

కలువాయి(సైదాపురం): రెండు కార్లు ఢీకొన్న ఘటన కలువాయి మండలం మాదన్నగారిపల్లి జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. తిరుమల శ్రీవారి దర్శనానంతరం దర్శికి కారులో కొందరు బయల్దేరారు. ఈ క్రమంలో మాదన్నగారిపల్లి వద్ద వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. రెండు కార్లలో ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో ఎవరూ గాయపడలేదు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బెల్టు షాపుపై ఎక్సైజ్ అధికారుల దాడి

కలువాయి(సైదాపురం): కలువాయిలోని కనకమహల్ వెళ్లే దారిలో ఉన్న కూల్‌డ్రింక్స్ షాపులో బెల్టు షాపును నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న నెల్లూరు ఎక్సైజ్ అధికారుల శనివారం దాడి చేశారు. మద్యం కేసును స్వాధీనం చేసుకొని నిర్వాహకుడ్ని అదుపులోకి తీసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదెల మృతి



కలువాయి(సైదాపురం): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన కలువాయి మండలంలోని కుల్లూరు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గేదెల కళేబరాలను పక్కకు తొలగించారు. రోడ్డు దాటుతున్న గేదెలను మితిమీరిన వేగంతో వస్తున్న వాహనం ఢీకొని ఉండొచ్చని భావిస్తున్నారు.